

# అభివృద్ధికే పట్టం

• ఐదోసారీ రామన్నవైపే సిరిసిల్ల ప్రజానీకం • కండ్లముందున్న ప్రగతిని చూసి ఆశీర్వాదం • ఆది నుంచీ అండగా నిలుస్తున్న కార్మిక క్షేత్రం





రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ): వస్త్ర పరిశ్రమ సంక్షోభంతో ఉపాధి కరువై.. మర నేతన్నలు దారాలనే ఉరితాళ్లుగా పేనుకుని ఆత్మహత్యలు చేసుకున్నారు. సిరిసిల్ల పట్టణంలోని ఏ వార్డులో చూసినా నేతన్నల మరణ గాథలు, కుటుంబ సభ్యుల రోదనలు.. ఇది నాటి సమైక్య పాలనలోని నాటి పరిస్థితి. ఆ పరిస్థితి నేడు పూర్తిగా మారిపోయింది. ఎమ్మెల్యేగా, మంత్రిగా కేటీఆర్ నేతన్నల బతుకులు మార్చేందుకు వస్త్ర పరిశ్రమను భుజానికెత్తుకున్నారు. మైక్రో, శేర్‌ముల్లా ఫైనాన్స్ ఉచ్చులో కూరుకుపోయిన నేతన్నలను విముక్తి చేసేందుకు కేసీఆర్ పార్టీ ఫండ్ రూ.50లక్షలు ఇచ్చి ఆదుకున్నారు. బయట అప్పుపుట్టక బ్యాంకుల్లో తీసుకున్న రూ.లక్ష లోపు రుణాలను మాఫీ చేయించారు. 904మంది నేత కార్మికులకు రూ.3.70కోట్లు మాఫీ చేయించారు. స్వరాష్ట్రం సాధించుకున్న తర్వాత కార్మికులకు చేతినిండా పని కల్పించాలన్న ఉద్దేశంతో బతుకమ్మ చీరెల తయారీ ఆర్డర్లు ఇప్పించారు. ఏటా రూ.350కోట్ల బతుకమ్మ చీరెలు, కేసీఆర్ కిట్లు, క్రిస్మస్, రంజాన్ దుస్తుల తయారీ ఆర్డర్లు సిరిసిల్లకే ఇప్పించారు. చీరెల తయారీతో చేతినిండా పని, పనికి తగ్గ కూలీ నెలకు రూ.15వేల నుంచి రూ.20వేలు వచ్చేలా కృషి చేశారు. పాత మరమగ్గాలను ఆధునీకరించుకునేందుకు, డాబీల ఏర్పాటుకు సబ్సిడీ రుణాలు అందించారు. దేశంలోని అన్ని రాష్ట్రాలలోని మరమగ్గాల తయారీ కంపెనీలతో సిరిసిల్ల మార్కెట్ కమిటీలో ఎగ్జిబిషన్ నిర్వహించారు. మరమగ్గాల ఆధునీకరణకు నిధులు ఇచ్చి నాణ్యమైన వస్త్ర ఉత్పత్తులకు శ్రీకారం చుట్టించారు. నేతన్నకు చేయూత పథకంలో 5,803 మందికి రూ.1.64కోట్లు 10శాతం నూలుపై సబ్సిడీ ఇప్పించారు. ఈ పథకంలో ఒక్కో కార్మికుడు రూ.30వేల నుంచి రూ.60వేల వరకు లబ్ధి పొందారు. రైతులకు మాదిరిగా దేశంలో ఎక్కడా లేనివిధంగా నేతన్నకు రూ.5లక్షల బీమా పథకం అమలు చేశారు. అనారోగ్యంతో చనిపోయిన వారికి రూ.5లక్షల బీమాతో భరోసా కల్పించారు. జిల్లాలో పది మంది చనిపోయిన కార్మిక కుటుంబాలకు రూ.50లక్షలుల పరిహారం ఎల్ఐసీ నుంచి ఇప్పించి అండగా నిలిచారు.

## రూ.200 కోట్లకు పైగా పట్టణ ప్రగతి

ఈ ప్రాంత ప్రజల కోరిక మేరకు తొమ్మిది మండలాలు ఉన్న సిరిసిల్లను జిల్లా చేశారు. సమీకృత కలెక్టరేట్, పోలీస్ భవనం, జిల్లాకు కావాల్సిన అన్ని హంగులను సమకూర్చారు. రూ.వంద కోట్లతో సిరిసిల్ల పట్టణంలో రహదారుల విస్తరణ, జంక్షన్లను అభివృద్ధి చేశారు. సిరిసిల్ల అంటే వస్త్ర పరిశ్రమ అని గుర్తుండేలా కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహం, గాంధీ, నేతన్నల కాంస్య విగ్రహాలు పెట్టించారు. పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్నిచ్చేలా పార్కులు, మినీట్యాంక్ బండ్, మానేరులో బతుకమ్మ ఘాట్‌లు నిర్మించారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా సిరిసిల్ల జిల్లా కేంద్రానికి ఇరువైపులా రెండు వంద ఫీట్లతో రెండు బైపాస్‌లు ఏర్పాటు చేశారు. మధ్యలో డివైడర్లు, అందులో చెట్ల మొక్కల పెంపకంతో హరితతోరణంగా సిరిసిల్లకు స్వాగతం పలికేలా అభివృద్ధి చేశారు.

## ఎడ్యుకేషన్, ఇండస్ట్రీస్ హబ్‌గా సిరిసిల్ల

నాడు కేవలం ఒకే ఒక్క ప్రభుత్వ డిగ్రీ కళాశాలకే పరిమితమైన సిరిసిల్ల నేడు ఎడ్యుకేషన్ హబ్‌గా ఏర్పడింది. మెడికల్, వ్యవసాయ యూనివర్సిటీ, వ్యవసాయ పాలిటెక్నిక్, ఐటీఐ, అంతర్జాతీయ డ్రైవింగ్‌స్కూల్, జేఎన్‌టీయూ విద్యాసంస్థలను తీసుకొచ్చారు. విద్యతోపాటు ప్రతి ఒక్కరికీ చేతినిండా పని కల్పించాలన్న సంకల్పం. అందులో భాగంగా రూ.165 కోట్లతో అప్పారెల్ పార్కును పెట్టించారు. ఇప్పటికే గోకల్‌దాస్ కంపెనీ వెయ్యి మందికి లోదుస్తుల తయారీలో ఉపాధి కల్పించింది. మరో అంతర్జాతీయ సంస్థ టెక్స్‌పో ఇండస్ట్రీస్ త్వరలో రెండువేల మందికి ఉపాధి కల్పించే దిశగా సన్నాహాలు చేస్తున్నది. గంభీరావుపేట మండలం నర్మాలలో ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్ అందుబాటులోకి రానున్నది. కాళేశ్వరం తొమ్మిదో ప్యాకేజీతో మల్కపేట, అన్నపూర్ణ రిజర్వాయర్లను కట్టించారు. ఎదురెక్కిన గోదావరి జలాలతో వందలాది మంది మత్స్య కార్మికులకు ఉపాధి లభించింది. చీర్లవంచలో అతిపెద్ద ఆక్వాహబ్ పరిశ్రమ, యూనివర్సిటీలు. ధాన్యాగారాలు, మోడ్రన్ రైతు బజార్‌తోపాటు రూ.1,500 కోట్లకు పైగా నిధులు వెచ్చించారు. రాష్ట్రంలోనే సిరిసిల్లను నంబర్‌వన్‌గా అభివృద్ధి చేశారు. అన్నదాతలు, నేతన్నల ఆత్మహత్యలు, ఆకలిచావులతో తల్లడిల్లిన సిరిసిల్లను 'సిరు'ల ఖిల్లాగా చేసిన కేటీఆర్‌కే ఈ ఎన్నికల్లో ప్రజలు పట్టంకట్టారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా తమ నాయకుడిని వదులుకోలేదు. కుట్రలు, కుతంత్రాలు, ప్రలోభాలకు తలవంచలేదు. చేసిన సహాయానికి కృతజ్ఞతగా ఉంటారని సిరిసిల్ల ప్రజలు నిరూపించారు.



గంభీరావుపేట: మండల కేంద్రంలోని అమరవీరుల స్తూపం వద్ద నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ నేతలు



# డిపాజిట్ గల్లంతాయెనా..?

**ఉమ్మడి జిల్లాలో 204 మందికి డిపాజిట్లు రాలే..**


- 13 నియోజకవర్గాల్లో 235 మంది పోటీ
- ధరావతు దక్కింది కేవలం 31 మందికే
- ఎనిమిది చోట్ల డిపాజిట్ కోల్పోయిన బీజేపీ
- బరిలో నిలిచిన అన్ని స్థానాల్లో నామినేషన్ ఫీ కోల్పోయిన బీఎస్పీ

కరీంనగర్, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ రావడంతో ఎంతో మంది పోటీ చేసేందుకు సిద్ధమయ్యారు. పూర్వ కరీంనగర్ జిల్లా పరిధిలోని 13 నియోజకవర్గాల పరిధిలో 235 మంది బరిలో నిలిచారు. కానీ, అందులో 204 మంది డిపాజిట్ కూడా దక్కించుకోలేకపోయారు. ఇంతకీ డిపాజిట్ గల్లంతు కావడమంటే.. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ వేసే సమయంలో కొంత సొమ్మును ధరావతుగా చెల్లిస్తారు. జనరల్, బీసీ కేటగిరీకి అయితే ₹10 వేలు, ఎస్సీ, ఎస్టీలు అయితే ₹5 వేల చొప్పున నామినేషన్ రుసుం (డిపాజిట్) కడుతారు. పోలింగ్ ఫలితాల అనంతరం అభ్యర్థికి కనీస ఓట్లు వస్తే డిపాజిట్ తిరిగి ఇస్తారు. నిబంధనల ప్రకారం డిపాజిట్ రావాలంటే.. పోలై చెల్లుబాటు అయిన ఓట్లలో కనీసం 1/6 వంతు (16.66 శాతం) ఓట్లు రావాల్సి ఉంటుంది. అంటే దాదాపు ప్రతి 100 ఓట్లకు 17 ఓట్లు రావాల్సి ఉంటుంది. అలా పొందిన అభ్యర్థులకు మాత్రమే డిపాజిట్ తిరిగి చెల్లిస్తారు. లేదంటే, అభ్యర్థులకు డిపాజిట్ గల్లంతుగా లెక్కిస్తారు.

### ఎనిమిది చోట్ల బీజేపీ డిపాజిట్ గల్లంతు

పూర్వ కరీంనగర్ జిల్లాలోని 13 అసెంబ్లీ నియోజకవర్గాల్లో బరిలో ఉన్న బీజేపీ, కేవలం ఐదు చోట్ల డిపాజిట్లు దక్కించుకున్నా ఒక్క స్థానాన్నీ గెలుచుకోలేకపోయింది. చొప్పదండి, మానకొండూర్, ధర్మపురి, పెద్దపల్లి, రామగుండం, మంథని, సిరిసిల్ల, హుస్నాబాద్ నియోజకవర్గాలు.. మొత్తం ఎనిమిది చోట్ల డిపాజిట్లు కోల్పోయింది. అలాగే, బహుజన సమాజ్‌వాదీ పార్టీ (బీఎస్పీ), ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ) అభర్థులు కూడా డిపాజిట్లు దక్కించుకోలేకపోయారు. ఆయా నియోజకవర్గాల పరిస్థితి ఇలా ఉంది.

### కరీంనగర్‌లో 24 మంది




ఈ అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రధాన పార్టీలతో కలిపి మొత్తం 27 మంది బరిలో నిలిచారు. ఇక్కడ 5,307 పోస్టల్ బ్యాలెట్ కలుపుకొని 2,29,774 ఓట్లు పోలయ్యాయి. బీఆర్ఎస్ అభ్యర్థి గంగుల కమలాకర్ 92179 ఓట్లు సాధించి విజయం అందుకున్నారు. బీజేపీ అభ్యర్థి రెండో స్థానం, కాంగ్రెస్ అభ్యర్థి మూడో స్థానంలో నిలిచారు. మిగిలిన 24 మందికి డిపాజిట్ దక్కలేదు. బీఎస్పీ అభ్యర్థి ఎన్ శ్రీనివాస్ 1646 (0.67శాతం) ఓట్లు, అలాగే ఏఐఎఫ్‌బీ అభ్యర్థి అంబటి జోజిరెడ్డి 430 (0.19 శాతం) ఓట్లు సాధించగా, కనీస డిపాజిట్ దక్కలేదు.

### చొప్పదండిలో 12 మంది




ఈ నియోజకవర్గంలో పోస్టల్ ఓట్లు 983తో కలిపి మొత్తం 1,82,188 పోలయ్యాయి. ప్రధాన పార్టీల అభ్యర్థులతో కలిపి మొత్తం 14 మంది పోటీ చేశారు. అందులో కాంగ్రెస్, బీఆర్ఎస్ మినహా మిగిలిన 12 మంది డిపాజిట్ కోల్పోయారు. ఇక్కడ బీజేపీ అభ్యర్థి బొడిగె శోభకు 26,669 (14.64శాతం ) ఓట్లు, అలాగే బీఎస్పీ అభ్యర్థి కొంకటి శంకర్‌కు 5153 (2.83శాతం) ఓట్లు వచ్చినా.. డిపాజిట్ రాలేదు.

### మానకొండూర్‌లో 8 మంది




అసెంబ్లీ నియోజకవర్గంలో పోస్టల్ ఓట్లు 1,416 కలిపి మొత్తం 1,85,829 ఓట్లు పోలయ్యాయి. ఇక్కడ 10 మంది పోటీ పడ్డారు. అందులో కాంగ్రెస్, బీఆర్ఎస్ మినహా మిగిలిన ఎనిమిది మంది డిపాజిట్ కోల్పోయారు. బీజేపీ నుంచి పోటీ చేసిన ఆరెపల్లి మోహన్‌కు 14,879 (8.01శాతం) ఓట్లు, బీఎస్పీ అభ్యర్థి రామచంద్రం 3,345 (1.8 శాతం) ఓట్లు, ఏఐఎఫ్‌బీ అభ్యర్థి గణేశ్‌కు 324(0.17) ఓట్ల రాగా, డిపాజిట్ కోల్పోయారు.

### హుజూరాబాద్‌లో 19 మంది




ఈ నియోజకవర్గంలో 22 మంది పోటీలో ఉన్నారు. పోస్టల్ ఓట్లు 1689తో కలిపి మొత్తం 2,09,311 ఓట్లు పోలయ్యాయి. బీఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి 80333 ఓట్లు సాధించి గెలిచారు. బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. మిగిలిన 19 మంది డిపాజిట్ కోల్పోయారు. బీఎస్పీ అభ్యర్థి పల్లె ప్రశాంత్‌గౌడ్‌కు 2150 (1.03) ఓట్లు రాగా, డిపాజిట్ దక్కలేదు.

### జగిత్యాలలో 12 మంది




ఇక్కడ 15 మంది బరిలో నిలిచారు. పోస్టల్ ఓట్లు 1875 కలుపుకొని 1,76,359 పోలయ్యాయి. బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ మాకనూరి సంజయ్ కుమార్ 70,243 ఓట్లు సాధించి, రెండోసారి విజయం అందుకున్నారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. మిగిలిన 12 మంది డిపాజిట్ దక్కించుకోలేకపోయారు. బీఎస్పీ అభ్యర్థి మల్లేశం యాదవ్‌కు 1242 (0.7శాతం) ఓట్లు రాగా, డిపాజిట్ దక్కలేదు.

### ధర్మపురిలో 13 మంది




ఇక్కడ పోస్టల్ ఓట్లు 1239 కలుపుకొని మొత్తం 1,81, 690 ఓట్లు పోలయ్యాయి. 15 మంది బరిలో ఉండగా.. కాంగ్రెస్, బీఆర్ఎస్ మినహా 13 మంది డిపాజిట్ దక్కించుకోలేకపోయారు. బీజేపీ అభ్యర్థి ఎస్ కుమార్‌కు 7345 (4.04) ఓట్లు, బీఎస్పీ అభ్యర్థి నక్క విజయ్‌కుమార్‌కు 1344 (0.74) ఓట్లు వచ్చినా.. డిపాజిట్ రాలేదు. అలాగే ఏఐఎఫ్‌బీ అభ్యర్థి సైతం డిపాజిట్ కోల్పోయారు.

### కోరుట్లలో 12 మంది




ఈ అసెంబ్లీ నియోజకవర్గంలో 15 మంది పోటీ పడ్డారు. పోస్టల్ ఓట్లు 1450తో కలిపి మొత్తం 1,83,590 ఓట్లు పోలయ్యాయి. బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల తొలిప్రయత్నంలో విజయం అందుకున్నారు. 72,115 ఓట్లతో గెలుపొందారు. బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు రెండు, మూడు స్థానాలకు పరిమితమయ్యారు. మిగిలిన 12 మంది డిపాజిట్లు గల్లంతయ్యాయి. బీఎస్పీ అభ్యర్థి కార్తికేయ పూదరికి 2,466 (1.34 శాతం) ఓట్లు, ఏఐఎఫ్‌బీ అభ్యర్థి శ్రీనివాసరావుకు 657 (0.36శాతం) ఓట్లు రాగా, డిపాజిట్ దక్కలేదు.

### పెద్దపల్లిలో 15 మంది




అసెంబ్లీ నియోజకవర్గంలో 17 మంది బరిలో నిలిచారు. పోస్టల్ ఓట్లు 1376తో కలుపుకొని 2,07,944 ఓట్లు పోలయ్యాయి. అయితే కాంగ్రెస్, బీఆర్ఎస్ మినహా మిగిలిన 15 మంది డిపాజిట్లు గల్లంతయ్యాయి. అందులో బీజేపీ అభ్యర్థి దుగ్యాల ప్రదీప్‌కుమార్‌కు 6,312 (3.04శాతం) ఓట్లు, బీఎస్పీ అభ్యర్థి దాసరి ఉషకు 19,315 (4.96శాతం) ఓట్లు వచ్చినా.. డిపాజిట్ కోల్పోయారు.

### మంథనిలో 19 మంది




ఇక్కడ 21 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. పోస్టల్ ఓట్లు 908 కలుపుకొని మొత్తం 1,96,543 ఓట్లు పోలయ్యాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్ మినహా 19 మంది డిపాజిట్లు కోల్పోయారు. బీజేపీ అభ్యర్థి చందుపట్ల సునీల్‌రెడ్డికి 5779 (2.74 శాతం) ఓట్లు, బీఎస్పీ అభ్యర్థి చల్ల నారాయణరెడ్డికి 2937 (1.49 శాతం) ఓట్లు వచ్చినా.. డిపాజిట్ మాత్రం రాలేదు.

### రామగుండంలో 21 మంది




ఈ అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం 23 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ఇక్కడ పోస్టల్ ఓట్లు 1,129 కలుపుకొని మొత్తం 1,52,988 ఓట్లు పోలయ్యాయి. కాంగ్రెస్ విజయం సాధించగా, రెండోస్థానంలో బీఆర్ఎస్ అభ్యర్థి నిలిచారు. మిగిలిన 21 మంది డిపాజిట్లు గల్లంతయ్యాయి. బీజేపీ అభ్యర్థి కందుల సంధ్యారాణికి 12,966 (6,48 శాతం) ఓట్లు రాగా డిపాజిట్ కోల్పోయారు. బీఎస్పీ అభ్యర్థి అంబటి నరేశ్‌యాదవ్ 853 (0.56 శాతం) ఓట్లు వచ్చినా.. డిపాజిట్ దక్కలేదు. 2014లో ఎమ్మెల్యేగా గెలిచిన సోమారపు సత్యనారాయణ ఈసారి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచినా.. కనీస డిపాజిట్ దక్కించుకోలేకపోయారు.

### సిరిసిల్లలో 19 మంది




ఈ నియోజకవర్గంలో 21 మంది పోటీలో ఉన్నారు. అయితే, ఇక్కడ పోస్టల్ ఓట్లు 1418 కలుపుకొని 1,88,740 ఓట్లు పోలయ్యాయి. బీఆర్ఎస్ అభ్యర్థి కల్వకుంట్ల తారకరామారావు 88,761 ఓట్లతో విజయం సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థి మినహా 19 మంది డిపాజిట్ కోల్పోయారు. బీజేపీ అభ్యర్థి రాణిరుద్రమకు 18,328 (9.71 శాతం) ఓట్లు, బీఎస్పీ అభ్యర్థి పిట్టల భూమేశ్ 7585 (4.02శాతం) ఓట్లు, ఏఐబీఎఫ్ అభ్యర్థి పత్తిపాక సురేశ్‌కు 1166 (0.62శాతం) ఓట్లు వచ్చినా.. డిపాజిట్ పొందలేకపోయారు.

### వేములవాడలో 13 మంది..



ఈ నియోజకవర్గంలో పోస్టల్ ఓట్లు 1263 కలుపుకొని మొత్తం 1,74,145 ఓట్లు పోలయ్యాయి. ఇక్కడ 16 మంది బరిలో ఉండగా 13 మంది తమ డిపాజిట్ కోల్పోయారు. బీఎస్పీ అభ్యర్థి గోలిమోహన్ 4,649 (2.67శాతం) ఓట్లు, ఏఐబీఎఫ్ అభ్యర్థి గుగ్గిళ్ల రవిగౌడ్ 247 (0.14 శాతం) ఓట్లు సాధించినా.. డిపాజిట్ దక్కించుకోలేకపోయారు.

### హుస్నాబాద్‌లో 17 మంది..



ఇక్కడ పోస్టల్ ఓట్లు 1681 కలుపుకొని మొత్తం 2,06,698 ఓట్లు పోలయ్యాయి. మొత్తం 19 మంది బరిలో ఉండగా.. కాంగ్రెస్, బీఆర్ఎస్ మినహా మిగిలిన 17 మంది డిపాజిట్ కోల్పోయారు. అందులో బీజేపీ నుంచి పోటీ చేసిన బొమ్మ శ్రీరాం చక్రవర్తి 8,338 (4.03 శాతం) ఓట్లు, బీఎస్పీ నుంచి పోటీ చేసిన పీ శ్రీనివాస్ 2694 (1.3 శాతం) ఓట్లు సాధించినా.. డిపాజిట్ కోల్పోయారు.

# 27న సింగరేణి ఎన్నికలు

- తాజాగా తేదీ ఖరారు
- ఇప్పటికే గుర్తుల కేటాయింపు
- ఏర్పాట్లలో యాజమాన్యం
- కార్మిక సంఘాలకు ఓటరు లిస్టు అందజేసిన ఎన్నికల అధికారి
- పదకొండు ఏరియాల్లో 39,748 మందికి ఓటు హక్కు



గోదావరిఖని, డిసెంబర్ 4 : అక్టోబర్ 28న సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించాలని సెప్టెంబర్ 27న నోటిఫికేషన్ ఇచ్చారు. అక్టోబర్ 6, 7 తేదీల్లో నామినేషన్లు స్వీకరించారు. 10న పరిశీలించి, 13 కార్మిక సంఘాలు బరిలో ఉంటున్నట్టు డిప్యూటీ లేబర్ కమిషనర్, ఎన్నికల అధికారి శ్రీనివాసులు ప్రకటించారు. గుర్తులు కూడా కేటాయించారు. కానీ, అప్పటికే (అక్టోబర్ 9న) అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి షెడ్యూల్ రావడంతో సింగరేణి ఎన్నికలు వాయిదా వేయాలని యాజమాన్యంతోపాటు మెజార్టీ కార్మిక సంఘాలు అభ్యంతరం తెలిపాయి. ఈ క్రమంలోనే హైకోర్టు తీర్పునిచ్చింది. ఈ ప్రక్రియ ఇలాగే ఉంటుందని, డిసెంబర్ 27న ఎన్నికలు నిర్వహించుకోవాలని అక్టోబర్ 11న స్పష్టం చేసింది. ఈ నెల 3న అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ పూర్తి కావడంతో ఎన్నికల ప్రత్యేకాధికారి, డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ శ్రీనివాసులు సోమవారం 13 కార్మిక సంఘాల ప్రతినిధులతో హైదరాబాద్‌లోని రీజినల్ లేబర్ కమిషనర్ (ఆర్‌ఎల్‌సీ) కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. నిలిచి పోయిన ఎన్నికల ప్రక్రియను తిరిగి మొదలు పెట్టాలని నిర్ణయించారు. ఈ మేరకు గుర్తింపు ఎన్నికల కోసం కావాల్సిన ఏర్పాట్లు చేయడానికి సింగరేణి అధికారులు అంగీకారం తెలిపారు. నవంబర్ 30లోగా పదకొండు ఏరియాల పరిధుల్లో విధుల్లో ఉండే 39,748 మందితో ఉన్న కార్మికుల ఓటరు లిస్టును ఎన్నికల ప్రత్యేకాధికారికి అందజేశారు. ఆ తర్వాత కార్మిక సంఘాల ప్రతినిధులకు ఓటరు లిస్టును డీవైసీఎల్‌సీ అందించారు. 27న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. అదే రోజు రాత్రి 7 గంటల నుంచి ఏరియాల వారీగా ఓట్లు లెక్కించనున్నారు. ఈ నేపథ్యంలో నేటి నుంచి కార్మిక సంఘాల నాయకులు ప్రచారంలో మునిగి తేలనున్నారు. డీవైసీఎల్‌సీతో జరిపిన చర్చల్లో గుర్తింపు కార్మిక సంఘం టీబీజీకేఎస్ అధ్యక్షుడు వెంకట్రావ్, వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య, ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి బాజీ సైదా, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి మందా నర్సింహారావు, హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ ఆహ్మద్, ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి జనక్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## 39,832 మంది కార్మికులకు ఓటు హక్కు

సింగరేణిలో 27న జరిగే ఎన్నికల్లో 39,832 మంది కార్మికులు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ మేరకు కార్మిక సంఘాలకు ఓటరు లిస్టును డిప్యూటీ లేబర్ కమిషనర్ శ్రీనివాసులు అందజేశారు. బెల్లంపల్లి డివిజన్‌లో 985 మంది, మందమర్రిలో 4876 మంది, శ్రీరాంపూర్‌లో 9124 మంది, కొత్తగూడెం కార్పొరేట్‌లో 1192 మంది, కొత్తగూడెం డివిజన్‌లో 2370, మణుగూరులో 2414 మంది, ఇల్లందులో 603 మంది, ఒడిషాలో నైని బ్లాకులో కేవలం ఇద్దరు ఓటర్లు, భూపాలపల్లిలో 5350 మంది, రామగుండం-1లో 5430 మంది, ఆర్జీ-2లో 3479 మంది, ఆర్జీ-3లో 3063, ఏపీఏలో 944 మంది కార్మికులు ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు తెలిపారు.

# రాజన్న ఆలయం.. భక్త'జన'సంద్రం



స్వామి వారి దర్శనంకోసం క్యూలో నిల్చున్న భక్తులు



ఆలయం ఎదుట కార్తీకదీపాలు వెలిగించుకుంటున్న భక్తురాలు

వేములవాడ టౌన్, డిసెంబర్ 4: కార్తీక సోమవారం సందర్భంగా వేములవాడలోని శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామివారి ఆలయం భక్తులతో పోటెత్తింది. వేకువజాము నుంచే భక్తులు ధర్మగుండంలో స్నానాలు ఆచరించి, కోడెమొక్కు చెల్లించుకున్నారు. ఆలయ కళాభవన్‌లో కల్యాణం మొక్కులు తీర్చుకున్నారు రాత్రి ఆలయ అద్దాల మండపంలో మహాలింగార్చన కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. గంటలతరబడి జిగ్‌జాగ్ క్యూలైన్లలో నిలబడి స్వామివారిని దర్శించుకున్నారు. రాజన్నను దాదాపు 60వేలకు పైగా భక్తులు దర్శించుకోగా, స్వామివారికి సుమారు రూ.28లక్షల ఆదాయం సమకూరిందని ఆలయ అధికారులు వెల్లడించారు. ఆలయ అనుబంధ దేవాలయాల వద్ద కూడా భక్తుల రద్దీ నెలకొన్నది. స్వామి,అమ్మవార్ల దర్శనంకోసం బారులు తీరి నిలబడి దర్శించుకున్నారు. పట్టణంలో భక్తుల తాకిడి ఎక్కువగా ఉండడంతో వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి ఆధ్వర్యంలో పట్టణ సీఐ కరుణాకర్ భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు.